క్లుప్తంగా

వినుకొండలో తొలిరోజు ఒక్క నామినేషన్

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలో నామినేషన్ ప్రక్రియ తొలి రోజున పిరమిడ్ పార్టీ నుంచి ఒక నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి వరదా సుబ్బారావు తెలిపారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గద్దం రమణ అనే మహిళ తొలి నామినేషన్ వేసింది.

6వ తరగతి ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్లు విడుదల

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 21న జరిగే 6వ తరగతి ప్రవేశపరీక్షకు హాల్ టిక్కెట్లు విడుదల అయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి నిర్వహించే 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్ లైన్ వెబ్‌సైట్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకొని తీసుకొని రావచ్చునన్నారు. తమ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరమునకు 6వ తరగతిలో మొత్తం 100 సీట్లు ఉన్నాయని అన్నారు. 6వతరగతి ప్రవేశ పరీక్షకు 265 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నారని ఆయన తెలిపారు. మిగిలిన వివరములకు పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు



వినుకొండ(నూజెండ్ల): ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు రూరల్ సి.ఐ సుధాకర్ అన్నారు. నూజెండ్ల మండలం ములకలూరు గ్రామంలో పోలీసు బలగాలతో వీధుల వెంట కవాతు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్ తనిఖీలు కూడా చేపట్టారు. అనంతరం ప్రజనుద్దేశించి సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మీ నారాయణరెడ్డిలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో తాగునీటి సరఫరా బంద్

నరసరావుపేట: పట్టణానికి శాంతినగర్ నుంచి తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైపులైనుకు ఏర్పడిన లీకును సరిచేసే నిమిత్తం పట్టణంలో నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం, సాయంత్రం తాగునీటి సరఫరా ఉండదన్నారు. ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.

మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ప్రచారం



నరసరావుపేట రూరల్: మండలంలోని చినతురకపాలెంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మైనార్టీలకు అమలు చేసిన పథకాలను తెలియజేసారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులకు ఓటువేస్తే ముస్లిం రిజర్వేషన్‌లు రద్దు చేస్తారని తెలిపారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు అండగా నిలుస్తూ నాలుగు శాతం రిజర్వేషన్ తీసుకువచ్చారని, దీనిని తొలగించేందుకు చంద్రబాబు కుట్రచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో షేక్ సర్దార్, షేక్ సుభాని, సయ్యద్ జునియద్, వరవకట్ల బుజ్జి, అమీర్, షేక్ పాదిలి ఖాజా, షేక్ ముదిరే సైదా, నాయబ్ మౌలాలి, మీయన్ మౌలాలి, నన్ను వలి, ఎంఐఎం నాయకుడు అరిఫ్ పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

క్రోసూరు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.మేరీ సుజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిషు మీడియంలో ఎలాంటి ఫీజు లేకుండా ఉచిత విద్యనభ్యసించవచ్చని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, మోడల్ స్కూల్‌లోని పరీక్ష కేంద్రానికి ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలని పేర్కొన్నారు. అలాగే ఇంటర్‌మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు ఈ నెల 24వ తేదీ వరకు పరీక్షల ఫీజు చెల్లించవచ్చని, ఇంప్రూవ్‌మెంట్‌కు కూడా ఫీజు గడువులోగా చెల్లించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఫ్యాను గుర్తుకు ఓటేస్తేనే అభివృద్ధి, సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు
- చిలకలూరిపేట ఆరో వార్డులో ఎన్నికల ప్రచారం

చిలకలూరిపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటువేస్తే అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేసినట్లేనని..అదే టీడీపీకి వేస్తే అవినీతి, అక్రమాలు మద్దతు తెలిపినట్లు అవుతుందని పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం ఆరో వార్డులోని ఎన్టీఆర్ కాలనీ, ఎరుకల కాలనీ, పార్కు బజారు, సంతబజారు, నరసరావుపేట రోడ్డు పక్క నివాసాలు, లక్ష్మి నరసింహ కాలనీల్లో పర్యటించారు. ముందుగా ఎన్టీఆర్ కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మహిళలు హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో కలిసి కావటి మనోహర్ నాయుడు ఇంటింటి ప్రచారం కొనసాగించారు. మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ.. వారి యోగక్షేమాలు, సమస్యలు తెలుసుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ అందరితో మమేకమయ్యారు. గడప గడపలో సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు



యువకుడితో మాట్లాడుతున్న మనోహర్ నాయుడు

కూటమి వన్నీ బూటకపు హామీలే

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూటమి నాయకులు చెప్పే బూటకపు హామీలను ప్రజలు నమ్మవద్దని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు సూచించారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ఆ పార్టీ నేతలకు దోచిపెట్టేలా చంద్రబాబు దుర్మార్గపు పాలన సాగించిన విషయాన్ని ఇంకా రాష్ట్ర ప్రజలకు మరువలేదన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో బాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని వివరించారు. 2014 నుంచి 2019 వరకు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చేసిన అవినీతి, అక్రమాల భాగోతం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో బూటకపు హామీలు ఇస్తున్న ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కూటమి బూటకపు మాటలను నమ్మి మరోమారు మోసపోవద్దన్నారు. జగనన్న ఐదేళ్ల పాలన ప్రజా సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా సాగిందని వివరించారు.

సంక్షేమపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా పి.అనిల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తలహాఖాన్, మాజీ అధ్యక్షుడు ఏవీఎం సుభాని, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, బైరా వెంకట కృష్ణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి బొల్లా



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా కుటుంబ సభ్యులు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

బొల్లాపల్లి: వైఎస్సార్ సీపీ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. తొలిరోజు మండలంలో వెంకటరెడ్డిపురం, జయంతి రామపురం, మేళ్లవాగు, పమిడిపాడు, గరికపాడు గ్రామాల్లో నియోజకవర్గ శాసన సభ్యులు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రధాన కూడళ్లలో శాసనసభ్యులు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ నవరత్నాలు వంటి సంక్షేమం ప్రతి పేదవాడి చెంతకు చేరిందని, పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమాభివృద్ధి పేదల అభ్యున్నతికి దోహదపడిందన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేవిధంగా స్వచ్ఛంద సేవలు అందజేశారన్నారు. మే నెల 13న జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్లమెంటుకు పి. అనిల్‌కుమార్ యాదవ్, శాసనసభకు బొల్లా బ్రహ్మనాయుడును అఖండ మెజార్టీతో గెలిపించే బాధ్యత మీపై ఉందని, మీ అభిమానమే రాబోయే ఐదేళ్లు తిరిగి మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల ఎన్నికల ప్రచారం

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గెలుపును కాంక్షిస్తూ ఆయన కుటుంబ సభ్యులు పట్టణంలోని 22, 26, 31, 32 వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డుల్లోని ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్యే బొల్లా వినుకొండకు చేసిన అభివృద్ధిని కరపత్రాల రూపంలో అందజేశారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను అఖండ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుమార్తె మణికుమారి, అల్లుడు గంగాధరరావు, కోడలు స్వప్న, మనుమరాలు శ్రీతన్యలు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- బసికాపురం, ఇస్సప్పాలెంలో ఎన్నికల ప్రచారం

నరసరావుపేట రూరల్: సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మండలంలో గురువారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. బసికాపురం, ఇస్సప్పాలెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అయా గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఐదేళ్లలో నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన సాగిందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్యను అందించింలా అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయడంతో పాటు వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కాకాని వద్ద రూ.150 కోట్లతో జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణాన్ని పూర్తిచేసినట్టు తెలిపారు. 200 పడకలతో ఉన్న వైద్యశాలను 400 పడకలుగా అభివృద్ధి చేసి జిల్లా ఆసుపత్రిగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. 60 సంవత్సరాలుగా నరసరావుపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటు కావాలని ఈ ప్రాంత వాసుల కలను సీఎం జగన్ నిజం చేశారని తెలిపారు. దీంతో పాటు 74 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లింగంగుంట్ల భూవివాదానికి పరిష్కారం చేయడం ద్వారా వేలాది మంది రైతుల్లో ఆనందం వ్యక్తంమవుతుందని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం జగన్‌కు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పేరం రాజానంద రెడ్డి, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, సర్పంచ్ వంపుగుడి రాజేష్, మాజీ సర్పంచ్ వంపుగుడి జాన్ తదితరులు పాల్గొన్నారు.



బసికాపురం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

తొలిరోజు ఒక్క నామినేషన్

చిలకలూరిపేట: నామినేషన్ల ప్రక్రియలో భాగంగా తొలిరోజు గురువారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం నామినేషన్ దాఖలయింది. సుబ్రమణ్యం తరుపున ఆయన సతీమణి రావు రామతులసి రిటర్నింగ్ అధికారి బి నారదమునికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

వలంటీర్లు రాజీనామా

శావల్యాపురం: వ్యక్తిగత కారణాలతో పలువురు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలను అందజేసినట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి గురువారం తెలిపారు. వీరిలో మండలంలోని వేల్పూరు 1,2 సచివాలయాలు పరిధిలో 22 మంది, కారుమంచి-17, మతుకుమల్లి-09, శావల్యాపురం-14, పిచికలపాలెం-07, కొత్తలూరు-08, శానంపూడి-05, పోట్లూరు-09 మంది వలంటీర్లు ఉన్నారని ఆమె వివరించారు.

యడ్లపాడు మండలంలో

యడ్లపాడు: మండలంలోని ఐదు గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 31 మంది వలంటీర్లు గురువారం తమ ఉద్యోగాలకు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఎంపీడీవోలకు ఆయా రాజీనామ పత్రాలను అందజేసినట్లు ఎంపీడీవో వై శ్రీనివాసరావు తెలిపారు.

సంక్షేమం అందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

డాక్టర్ గోపిరెడ్డి సుష్మితారెడ్డి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరో ఐదేళ్లు అందాలంటే పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిలను గెలిపించాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి సతీమణి డాక్టర్ సుష్మితారెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని 25వ వార్డు ఎన్‌జీవో కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో చేసిన ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో అమలుచేసిన సంక్షేమం, నిర్వహించిన అభివృద్ధి పనులపై ముద్రించిన కరపత్రాన్ని ఓటర్లుకు అందజేశారు. కార్యక్రమంలో వేలమూరి రామకృష్ణారెడ్డి, అచ్చి శివకోటి, వార్డు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



ఎన్‌జీవో కాలనీలో ప్రచారం చేస్తున్న డాక్టర్ సుష్మితారెడ్డి

ఘనంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అభయాంజనేయస్వామి 35వ వార్షికోత్సవ తిరునాళ్లను గురువారం నిర్వహించారు. ఉదయం నుండే మహిళా భక్తులు పొంగళ్లు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. ఆకు పూజలాంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను స్వామి వారికి నిర్వహించారు. భక్తులు భజనా కార్యక్రమాలు చేశారు. మరి కొందరు భక్తులు మజ్జిగ, పులిహోరా, లడ్డూ, పానకం ప్రసాదాలను పంపిణీ చేశారు. తిరునాళ్లలో రొంపిచర్ల పోలీసులు శాంతి భద్రతల పర్యవేక్షణ నిమిత్తం బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలి

వినుకొండ(నూజెండ్ల): బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు ఎనలేని గుర్తింపు నిచ్చిన వైఎస్సార్ సీపీకే ఓట్లు వేసి తమ మద్దతును తెలియజేయాలని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు మేరాజోత్ హనుమంతు నాయక్, వడ్డెర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల వెంకట్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో, చట్టసభల్లో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో బీసీలను ఓటు బ్యాంక్‌గానే వాడుకుని ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని గుర్తు చేశారు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఉప ముఖ్యమంత్రి పదవి ఎస్టీలకు ఇచ్చారని, మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేశారని, గిరిజనులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యతతో పాటు గిరిజన యూనివర్సిటీ, అటవీ హక్కుల చట్టం ప్రకారం 3 లక్షల ఎకరాలు పంపిణీ చేశారన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా వెనుకబడిన ఎస్టీలకు మారుమూల తండాల్లో కూడా పౌర సేవలు అందజేశారన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని, కంటి ముందు కనిపిస్తున్న అభివృద్ధిని టీడీపీ నాయకులు చూడలేక, అభివృద్ధిని చేయలేక అడ్డుపడుతూ అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఎమ్మెల్యే బొల్లాకు, అనిల్‌కుమార్ యాదవ్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా అండగా ఉన్నామని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు హనుమంతునాయక్, వెంకట్, సునిల్‌యాదవ్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నాదెండ్ల: అగ్నిమాపక దళ శాఖ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం గొరిజవోలులోని జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవీ సుబ్బారావు, లీడింగ్ ఫైర్‌మెన్ జంబుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బందికి డెమో నిర్వహించి చూపారు. అగ్ని ప్రమాదం జరిగినపుడు మంటలను ఆర్పే విధానం, ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తులను ఎలా రక్షించాలి అనే విషయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక దళ పరికరాల వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో కంపెనీ జీఎం పూర్ణచంద్రరావు, హెచ్ఆర్ మేనేజర్ బాబ్‌జాన్, ఫైర్ సిబ్బంది కిరణ్, ప్రసాద్, సాంబశివరావు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ధూళిపాళ్ల గ్రామంలోని దొడ్ల డెయిరీలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు దాన్ని ఎలా ఎదుర్కోవాలో డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డెయిరీ హెచ్ఆర్ మేనేజర్ ఇ.విశ్వనాథరెడ్డి, ప్లాంట్ మేనేజర్ కె.రమేష్, సత్తెనపల్లి అగ్ని మాపక కేంద్ర సిబ్బంది ఎం.మోహన్ బాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొదటి రోజే సందడి సందడిగా...

- ఆర్వో కార్యాలయానికి పలువురు అభ్యర్థులు రాక
- పార్లమెంట్ స్థానానికి ఒకటి, అసెంబ్లీ స్థానానికి రెండు దాఖలు
- అభ్యర్థితో కలిపి నలుగురికి అనుమతి

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల పర్వం గురువారం నుంచి ఆరంభమైంది. తిథి, వార, నక్షత్రాలు, వర్జం, దుర్ముహూర్తం వంటివి తమకు సరిపోతాయా లేదా అని చూసుకుని కొందరు అభ్యర్థులు నామినేషన్ సెట్లను ఎన్నికల అధికారులకు అందజేశారు. తొలి రోజు టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు ఉదయం 11.20గంటలకు రెండుసెట్ల నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్‌కు అందజేశారు. నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి పి.సరోజినికి అందజేశారు. జాతీయ జనసేన పార్టీ తరపున అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ గోదా రమేష్‌కుమార్ రెండుసెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

నామినేషన్లు స్వీకరించేందుకు జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయ పరిసరాల్లో పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యాలయాలకు ఒక ఫర్లాంగు దూరంలోనే రోడ్లకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటుచేసి ట్రాఫిక్ నియంత్రించారు. స్టేషన్ రోడ్డులో ఒక వైపు ఆర్‌యూబీ, మరోవైపు మున్సిపల్ కార్యాలయాలు హద్దుగా బారికేడ్లు ఏర్పాటుచేయగా, మధ్యలో మోర్‌సెంటర్, బీపీకే బిల్డింగ్ సెంటర్ల వరకు బారికేడ్లు ఏర్పాటుచేసి రాకపోకలను నియంత్రించారు. నామినేషన్లు దాఖలు చేసే వ్యక్తితోపాటు కేవలం నలుగురినే అనుమతించారు.

సాగర్ జలాలు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు

ఎన్నెస్పీ ఈఈ రేపూడి మల్లిఖార్జునరావు

శావల్యాపురం: సాగర్ జలాలు చేపల చెరువులకు అక్రమ మార్గంలో వినియోగిస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎన్నెస్పీ ఈఈ రేపూడి మల్లిఖార్జునరావు హెచ్చరించారు. గురువారం శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు పోటూర్లు మేజరు కాల్వకు అక్రమంగా గండి కొట్టిన ఏరియాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నెస్పీ ఈఈ మాట్లాడుతూ సాగర్ జలాలు తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అలాగే ప్రజలు సాగర్ జలాలు వృథా చేయవద్దన్నారు. పోట్లూరు మేజరు కాల్వ అక్రమంగా పగల కొట్టిన గుర్తు తెలియని వ్యక్తులపై శావల్యాపురం పోలీసు స్టేషను ఎన్నెస్పీ అధికారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో రైతులు అధికారులకు సహకరించాలన్నారు. ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పర్యవేక్షణలో మంచినీటి చెరువులు, వాగులు, నీటి కుంటలు నూరు శాతం నింపేలా చూడాలన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండటానికి ప్రభుత్వం సాగర్ జలశయం నుంచి 5500 క్యూసెక్కులు నీటిని విడుదల చేసిందని ఈనెల 25 వరకు సాగర్ జలాలు అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు విడుదల అవుతాయన్నారు. ఆయనతో పాటు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు, ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ, నందకిషోరు తదితరులు ఉన్నారు.



పోట్లూరు మేజరు కాల్వను పరిశీలిస్తున్న ఎన్నెస్పీ అధికారులు

లిఖిత్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: అత్యాధునిక వైద్య పరికరాలతో కోట సెంటర్‌కు సమీపంలో బైపాస్‌రోడ్డుపై నిర్మించిన లిఖిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. లిఖిత్, బ్లోజమ్స్ హాస్పిటల్స్ చైర్మన్ మేకల రామిరెడ్డి పర్యవేక్షణలో డాక్టర్ వినోద్ కుమార్ రామిరెడ్డి, డాక్టర్ సునీత కుమారి మేకల ఈ హాస్పిటల్‌ను నిర్మించారు. ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మరో ఆధునిక హాస్పిటల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. చైర్మన్ రామిరెడ్డి మాట్లాడుతూ హాస్పిటల్‌లో పేషెంట్లకు జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ తదితర సేవలు లభిస్తాయన్నారు. బ్లాజమ్స్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మేకల సుధీర్ కుమార్ రెడ్డి, కల్పతరువు చిట్స్ ప్రతినిధి ఇప్పల దానారెడ్డితో పాటు పట్టణంలోని ప్రముఖ డాక్టర్లు ఏఏవీ రామలింగారెడ్డి, కారసాని శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కేజే మోహనరెడ్డి, విజయారెడ్డి, కవితారెడ్డి, పల్లకి వేణుగోపాల రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, ప్రత్యూష, చెన్నారెడ్డి, వసంతరాయ, డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు హాజరై హాస్పిటల్ అధినేతలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, చైర్మన్ మేకల, డాక్టర్ వినోద్ కుమార్

దేశ రాజకీయాల్లో ఏ సీఎంకు ఇంత ధైర్యం లేదు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయండి అని చెప్పే ధైర్యం దేశ రాజకీయాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తప్ప మరెవ్వరికీ లేదని వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలియజేశారు. చిలకలూరిపేట మండలం రాజాపేట, గోపాళంవారిపాలెం గ్రామాల్లో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండుగ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజల సమస్యల్ని తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో వివిధ అభివృద్ధి, నవరత్న సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధి వివరాలను ప్రజలకు వివరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ప్రచార విజయరథంపై ఎక్కి రోడ్ షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సభను నిర్వహించారు. ఆయా సభలలో ప్రజల నుద్దేశించి కావటి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను చూసి ఎంతో మంది టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రెండు గామాల్లో జరిగిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను ప్రజలకు వివరించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా ధర్మం పక్షాన నిలిచిన వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తారో... అబద్ధాల టీడీపీ కూటమికి ఓటు వేస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ విప్ల వం నడుస్తోందని, ఆ సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగించుకోవాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొనడం జరిగింది.